




సభకు వెళ్లే దారుల్లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ జెండాలు, పోస్టర్లు

# జాతరను తలపించేలా రజతోత్సవ మహాసభ

- ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు
- రైతులు బండెనుక బండికట్టి బయలు దేరారు..
- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- ఎండ్లబండ్లకు ఎదురేగి స్వాగతం



ర్యాలీ ప్రారంభిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, ఏప్రిల్ 26 : 'సమ్మక్క, సారలమ్మ జాతరను తలపించేలా బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ జరగనున్నది. అనేక మార్గాల్లో అనేక వాహనాల్లో ఇప్పటికే జనం వస్తున్నారు. రైతులైతే బండెనుక బండికట్టి బయలుదేరారు' అని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. రజతోత్సవ మహాసభలో పాల్గొనేందుకు సూర్యాపేట నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో రెండు రోజుల క్రితం ఎడ్లబండ్ల ద్వారా బయలు రైతులు శనివారం హనుమకొండకు చేరుకోగా, వారికి దాస్యం వినయ్‌భాస్కర్ హంటర్‌రోడ్డులోని నేషనల్ మార్ట్ (విష్ణుప్రియా గార్డెన్)వద్ద స్వాగతం పలికారు. రైతులకు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. 25 సంవత్సరాల రజతోత్సవ మహాసభ జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఆయన ఎడ్లబండి నడుపుకుంటూ అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లగా, రైతులు ఈలల వేస్తూ, జై తెలంగాణ, జై కేసీఆర్ అని నినాదాలు చేయగా, డప్పు చప్పుళ్లు, మహిళల కోలాటాలతో ఎడ్లబండ్లు ముందుకు సాగాయి. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. రైతులు బండెనక బండికట్టి, ఆటో కార్మికులు ఆటోల్లో, యువకులు సైకిళ్లు, మోటార్ సైకిళ్ల ద్వారా సభకు చేరేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. కేసీఆర్ మాటలు వినేందుకు ఉత్సాహంతో ఉన్నారని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రైవేటు వ్యక్తులు, పార్టీ వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. మహాసభకు వస్తున్న ప్రజలకు తాగునీరు, మజ్జిగ అందిస్తున్నట్లు తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఖచ్చితంగా సభను విజయవంతం చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. రైతులు జ్వరం వచ్చినా బండిలోనే సెలెన్ బాటిల్ ఎక్కించుకొని మహాసభకు వస్తున్నారని అన్నారు. ప్రజలు కేసీఆర్, కేటీఆర్, బీఆర్‌ఎస్ పాలనను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజక వర్గం కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, నాయకులు వెంకన్న, రామ్మూర్తి, శ్రీధర్, కోటేశ్వర్, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల పొట్టగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల పొట్టగొట్టి, వారి జీవితాలను ఆగం చేసిందని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఎల్కతుర్తిలో నేడు జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు నియోజకవర్గంలోని సుమారు 800లకు పైగా ఆటోలు హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఎల్కతుర్తికి ర్యాలీగా బయలుదేరాయి. దాస్యం వినయ్‌భాస్కర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి, వాటిలో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. జీవనోపాధి కరువై ఇప్పటికే వందలాది మంది ఆటో కార్మికులు ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఆటో కార్మికులకు టాక్స్ రద్దు చేశారని, రుణాలు అందించారని, లైసెన్స్‌లు ఇవ్వడంతోపాటు కార్మిక శాఖ ద్వారా లబ్ధి చేసినట్లు ఆయన గుర్తు చేశారు. అదే విధంగా హనుమకొండ జిల్లాలో ఆటో కార్మికుల సంఘాలను ఏర్పాటు చేశామన్నారు. రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా 800 ఆటోల్లో కార్మికులు తరలివస్తున్నారని, ఇప్పటికే వారు రూ.100116 సభకు విరాళం అందించినట్లు వినయ్ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘాల నాయకులు రవీందర్ రెడ్డి, సంజీవ్, అనిల్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, కుమార్, బాలు, జయరాం, స్వామి, సంజీవ్, బాబు, రమేశ్, రవీందర్, రాజేందర్, గణేష్, సంతోష్, నాగరాజు, శరత్, సమీర్, సుదర్శన్, రవి, కిట్టు, శ్యామ్ పాల్గొన్నారు.



ధర్మసాగర్ : బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న రాజయ్య

## సభకు భారీగా తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య
- గుండ్లసాగర్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ
- ధర్మసాగర్‌లో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరిక

వేలేరు/ధర్మసాగర్, ఏప్రిల్ 26 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. శనివారం వేలేరు మండలం గుండ్లసాగర్ గ్రామంలో మాజీ సర్పంచ్ గాదె ధర్మారెడ్డి అధ్యక్షతన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన బీఆర్‌ఎస్ తెలంగాణను సాధించి, పదేండ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. బీఆర్‌ఎస్ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయి నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బాలుడు గులాబీ జెండాను పట్టుకుని చెట్టు పైకి ఎక్కి తన సంతోషాన్ని వ్యక్తపరచగా, అక్కడున్న బీఆర్‌ఎస్ శ్రేణుల్లో మరింత ఉత్సాహం కన్పించింది. సమావేశంలో మండల ఇన్‌చార్జి భూపతిరాజు, మండల నాయకులు గాదె దేవేందర్‌రెడ్డి, మండల కో ఆర్డినేటర్ సురేశ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కొయ్యడ మహేందర్, మండల అధికార ప్రతినిధి మారబోయిన రాజు, కో ఆప్షన్ మాజీ సభ్యుడు జానీ, నాయకులు విజేందర్‌రెడ్డి, పోలు తిరుపతి తదితరులు పాల్గొన్నారు. కాగా, ధర్మసాగర్ మండలం ధర్మపురం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఓరుగంటి యాదగిరి తన అనుచరులతో కలిసి శనివారం మాజీ ఎమ్మెల్యే రాజయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి రాజయ్య గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే కాలంలో పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని, నిత్యం ప్రజల్లోనే ఉండాలని సూచించారు. జోజి, ప్రభాకర్, బాలస్వామి తదితరులున్నారు.


















సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- రజతోత్సవ సభా ఏర్పాట్ల పరిశీలన

## రజతోత్సవ సభ చరిత్రలో నిలుస్తుంది

ఎల్కతుర్తి, ఏప్రిల్ 26 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం (నేడు) జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలుస్తుందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సభా ఏర్పాట్లను ఆయన పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ 2001లో తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా కేసీఆర్ గులాబీ జెండా ఎగురవేశారన్నారు. 14 ఏండ్లు ఉద్యమాన్ని అంకురిత దీక్షతో నడిపి, తెలంగాణ సాకారమైన అనంతరం సీఎంగా పాలన పగ్గాలు చేపట్టి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో 10 జిల్లాలు ఉంటే, 9 జిల్లాలు వెనకబడి ఉన్నాయని అప్పటి కేంద్ర ప్రభుత్వం స్వయంగా చెప్పిందని గుర్తు చేశారు. అలాంటి రాష్ట్రాన్ని సీఎంగా కేసీఆర్ దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాల సరసన నిలిపారని తెలిపారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల్ని మభ్యపెట్టి, మోసపు హామీలతో అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే చీత్కారానికి గురవుతున్నదని విమర్శించారు. కొత్తవి పక్కన పెడితే గత ప్రభుత్వంలోని పథకాలను సైతం అమలు చేయకపోతున్నదని ఆరోపించారు. మళ్లీ రాష్ట్రానికి బీఆర్‌ఎస్సే రక్షణ అని ప్రజలు విశ్వసిస్తున్నారని చెప్పారు. సభకు వచ్చే ప్రజలు ముందుగానే చేరుకోవాలని బోయినపల్లి సూచించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, నాయకులు తంగెడ మహేందర్, ఎల్తూరి స్వామి, గొల్లె మహేందర్, వేముల శ్రీనివాస్, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి తదితరులున్నారు.



## సభకు కదిలిన ఎడ్లబండ్లు

ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామం నుంచి మాజీ ఉపసర్పంచ్ అల్లం సతీశ్ ఆధ్వర్యంలో భారీగా ఎడ్లబండు కదిలాయి. గులాబీ రంగుతో కాడెడ్లు, బండ్లను అందంగా అలంకరించి బండెనక బండి ర్యాలీగా తరలివెళ్లాయి. ఎర్రబెల్లి నుంచి ముల్కనూరు మీదుగా ఎల్కతుర్తికి వెళ్తున్న ఎడ్ల బండ్లను తిలకించేందుకు వచ్చిన ప్రజలు జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. - భీమదేవరపల్లి, ఏప్రిల్ 26



సభ బందోబస్తుపై పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు తదితరులు

